# కర్నూలు | నంద్యాల వార్త

9 డిసెంబర్ , 2024 సోమవారం పేజీలు 4


## డిసెంబర్ 26 లోగా సభ్యత్వం పూర్తిచేయాలి

**- టిడిపి జిల్లా అధ్యక్షులు పి తిక్కారెడ్డి మంత్రి టీజీ భరత్**



**కర్నూలు హాస్పిటల్, డిసెంబర్ 8, ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ సభ్యత్వం డిసెంబర్ 26 లోగ పూర్తిచేయాలని జిల్లా టిడిపి అధ్యక్షులు పి తిక్కారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జరిగిన సమావేశానికి మంత్రి టీజీ భరత్, శాసన సభ్యులు కెఇ శ్యాంకుమార్, బొగ్గుల దస్తగిరి, నియోజక పార్టీ ఇంచార్జీలు వీరభద్రగౌడ్, రాఘవేంద్రారెడ్డి, చైర మ్నన్లు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కప్పట్రాళ్ళ బొజ్జమ్మ, మాన్వి దేవేంద్రప్పలు పార్టీ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి అకేపోగు ప్రభాకర్, హాజరయ్యారు. సమావేశంలో ప్రధానంగా ఇప్పటి వరకు జిల్లాలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం 1,90,073 పూర్తిచేయడం జరిగిందన్నారు. నియోజకవర్గాల వారిగా ఆదోని 18896, ఆలూరు 40,765, కోడుమూరు 18,218, కర్నూలు 28,229, మంత్రాలయం 32,556, పత్తికొండ 23,964, ఎమ్మిగనూరు 27,445 మంది పార్టీ సభ్యత్వాలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం డిసెంబర్ 26 వరకు ఉన్నందున జిల్లా పరిధిలోని మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసన మండలి సభ్యులు, శాసన సభ్యులు, రాష్ట్ర, జిల్లా పార్టీ అనుబంధ కమిటీ నాయకులు మండల, పట్టణ, నగర కమిటీల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్ మరియు యూనిట్ ఇంచార్జీలు మీ మీ పరిధిలో సభ్యత్వ నమోదుకార్యక్రమాన్ని పూర్తిచేయాల్సిందిగా కోరారు. పార్టీ సభ్యత్వం తీసుకున్నవారికి రూ.5 లక్షల వరకు ప్రమాద భీమా వర్తిస్తుందని ఈఅంశాలన్నింటిని దృష్టిలో వుంచుకొని టిడిపి నాయకులు, కార్యకర్తలు సభ్యత్వం పొందాల్సిందిగా కోరారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓటమి తరువాత కాలయాపన రాజకీయాలు చేస్తున్నారని ప్రజలు చీదరించి అసెంబ్లీలో ప్రతిపక్షంలో కూడ లేకుండా చేసినా తానేదో రాష్ట్రాన్ని ఉద్ధరిస్తానని సంక్రాంతి నుండి బయటకు రానున్నానని మేకపోతు గాంబీర్యం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతూ ముందుకు వెళ్తుందని నీలాంటి పరదాల చాటున తిరిగే వ్యక్తిని రాష్ట్ర ప్రజలు విశ్వసించరనే విషయాన్ని గుర్తుంచుకుంటే మంచిందని చురకలు అంటించారు.




## ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లుకు..షాక్..!

- విధుల నుంచి తొలగింపు..ఉద్యోగ ఒప్పందంలో నిబంధనలు జారీ..
- రెండు దశాబ్దాలుగా వైద్య, ఆరోగ్యశాఖకు ఊడిగం..
- కరోనా సమయంలో ప్రాణాలు తెగించి విధులు..
- ఆత్మహత్యలే శరణ్యమంటున్న కాంట్రాక్టు ఆరోగ్య కార్యకర్తలు..
- ఉమ్మడి జిల్లాలో 23 మంది హెల్త్ అసిస్టెంట్లు ఉద్వాసన..

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలో హెల్త్ అసిస్టెంట్లుగా విధులు నిర్వర్తిస్తున్న మగ ఆరోగ్య కార్యకర్తలను ప్రభుత్వం తొలగించింది.. ఈ మేరకు జిల్లావైద్య, ఆరోగ్యశాఖకు ఉత్తర్వులు అందడంతో జిల్లాలో పలువురు కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లు(మేల్)లను తొలగించారు.. ఉద్యోగ నియామకంసమయంలో తమ రికార్డులను పరిశీలించి ఉద్యోగాలు ఇచ్చి ఇప్పుడు తొలగించడంపై జిల్లా ఆరోగ్యశాఖలో వివాదం చోటుచేసుకుంది.. ఇందుకు సంబంధించి మగ ఆరోగ్య కార్యకర్తలు(మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్) తమకు ఆత్మహత్యలే శరణ్యమంటూ కోర్టులను ఆశ్రయించేందుకు సిద్ధమయ్యారు.

• వివరాలు 2లో

## తగ్గుముఖం పడుతున్న.. తెల్లబంగారం..!

- కమీషన్ ఏజెంట్లు,వ్యాపారస్తులు సిండికేట్..
- ఒకవైపు ధర తగ్గుముఖం .. మరోవైపు నిలువుదోపిడీ..?
- అప్పుల్లో కూరుకుపోతున్న రైతులు
- పర్యవేక్షణలో అధికారులు విఫలమా..?



రైతన్న వర్షాన్ని ఆధారంగా చేసుకుని.. పంటసాగు చేసి ఆరుకాలం కష్టపడి పండించిన పంట దిగుబడులను మార్కెట్‌లో విక్రయించేందుకు వస్తే తీరా మార్కెట్‌లో తగిన గిట్టుబాటు ధర దొరకక మార్కెట్‌లో రాసిన ధరలకే విక్రయించి అందిన కాడికి రైతులు తీసుకెళ్లాల్సిన దుస్థితి.. కానీ వ్యాపారస్తులు మాత్రం రైతు తీసుకొచ్చిన సరుకును నాణ్యత లేదని.. తక్కువ ధరకు కొనుగోలు చేస్తారు. ఈ విధంగా చేయడం వలన రైతు పంట దిగుబడుల కోసం చేసిన అప్పులను తీర్చలేక కొందరు రైతన్నలు చావే శరణ్యమని ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు కూడా ఉన్నాయి.



**ఆదోని,డిసెంబరు 8,ప్రభాతవార్త** రాష్ట్రంలోనే అతిపెద్ద మార్కెట్‌లలో రెండవ అతిపెద్ద మార్కెట్ అయిన ఆదోని మార్కెట్‌యార్డు కావడం దానికి తోడు తెలంగాణ,కర్ణాటక సరిహద్దు ప్రాంతాలు కావడంతో సరిహద్దు ప్రాంతాల రైతులు కూడా అధిక సంఖ్యలో ఆదోని మార్కెట్‌కు పత్తి,వేరుశనగ దిగుబడులు విక్రయించేందుకు రైతులు అధిక సంఖ్యలో వస్తున్నారు. సీజన్ కావడంతో శనివారం మార్కెట్‌యార్డుకు వచ్చిన వివరాలు ఇలా పత్తి 2793క్వింటాళ్లు, వేరుశనగ 13క్వింటాళ్లు వచ్చినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. కానీ రైతన్నకు ఆశించిన స్థాయిలో ధరలు పలకటం లేదు. గతవారం రోజుల క్రితం రూ.7300లు పైచిలుకు పత్తి ధర పలికింది. అయితే శనివారం జరిగిన మార్కెట్ ధరతో పోల్చుకుంటే రూ.200నుంచి రూ.300లు దాక ధర తక్కువ పలికింది. శనివారం మార్కెట్‌యార్డులో ధర పత్తి గరిష్ట ధర 7189,కనిష్ట ధర రూ.4307లు ధరలు పలికాయి. దీంతో రైతన్నలు గిట్టుబాటు ధరలు దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రైతులు నిలువు దోపిడి :** రైతులు మార్కెట్‌కు తెచ్చిన వేరుశనగలను తూకాలు వేసే సమయంలో హమాలీలు రైతులకు వెడల్పుగా ఉన్న సెనగ కుప్పను దగ్గరకు చేయాలని ఆ విధంగా తూకాలు వేయడం త్వరగా జరుగుతుందని మాటల్లో మభ్యపెట్టి రైతన్న పనిలో బిజీగా ఉంటే హమాలీలు మాత్రం తూకాలు వేసే సమయంలో ఒక్కో బస్తా నుంచి 4నుంచి 6కేజీల దాకా ఎక్కువ తూకాలను వేసి రైతన్న పోయిన తర్వాత ఆ తూకాలను హమాలీలు వాళ్ల లెక్కల్లో తూకాలను జమ చేసుకుని అంగడి వ్యాపారస్తుల దగ్గర నుంచి డబ్బులను వారు తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

• వివరాలు 2లో

## ఉషా క్రీడలను నేను ప్రొత్సహిస్తూనే ఉంటా

**- రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్**

**కర్నూలు విద్య, డిసెంబర్ 8, ప్రభాతవార్త:** ఉషు క్రీడలను నేను ఎల్లప్పుడు ప్రొత్సహిస్తూ ఉంటానని రాజ్య సభ మాజీ సభ్యుల టీజీ వెంకటేష్ అన్నారు. ఆదివారం కిడ్స్ వరల్డ్ రోశయ్య కమ్యూనిటి హాల్ నందు జిల్లాస్థాయి ఉషా పోటీల ప్రారంభానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టీజీ వెంకటేష్ మాట్లాడుతూఉషా మార్షల్ ఆర్ట్స్ క్రీడలను చుస్తుంటే ఎంతో సంతోషంగా ఉందన్నారు. జిల్లా ఉష సంఘం కార్యదర్శి టి శ్రీనివాసులు మాట్లాడుతూ ఈపోటీల్లో 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారని ఈపోటీలకు టీజీ వెంకటేష్ సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. ఈకార్యక్రమానికి జిల్లా ఒలంపిక్ సంఘం కార్యదర్శి జి శ్రీనివాసులు, రిఫ్రీలుగా సుధాకర్, చిన్న శ్రీనివాసులు, అనుమతిశ్వర్, నాగ సులోచన, మధు, మేఘన తదితరులు పాల్గొన్నారు.



## అయ్యా పాలకులారా.. నా గురించి పట్టించుకోండి..!

**- శిథిలమైన గ్రంధాలయ ఘోష**

అయ్యా నియోజకవర్గం పాలకులారా నేను గత 100 ఏళ్ళ నుండి దాదాపు 90 ఏళ్ళు నియోజకవర్గ ప్రజలకు జ్ఞాన సంపదను అంధించాను దీంతో ఎంతో మంది ఉన్నతస్థాయిలో నిలిచారు. అయితే 10 ఏళ్ళుగా నేను శిథిలావస్తలో ఉన్నాను నా గురించి గత పాలకులు కాని నా నుండి జ్ఞాన సంపద పొందిన వారు కాని పట్టించుకోవడం లేదు.. నేను కోట్లు విలువ చేసే స్థాయిలో ఉన్నా.. నా పరిస్థితి చూచి ఎవరికి జాలి కలుగడంలేదని ఘోసిస్తున్న గ్రంధాలయం.

వివరాలలోకి వెళితే...

**నందికొట్కూరు, డిసెంబర్ 8,ప్రభాతవార్త:** బ్రిటిష్ కాలంలో ఆప్పటి గ్రామ పెద్దలు ప్రజలు, విద్యార్థులు చదువుకునేందుకు గ్రంధాలయ ఏర్పాటు కోసం దాదాపు 50 సెంట్ల భూమిని దానంగా ఇచ్చారు. దీంతో అక్కడ ప్రజలు, విద్యార్థులు నిత్యం వెళ్ళి సమాచార పత్రికలు, విజ్ఞానం కలిగించే పుస్తకాలు చదువుకునేందుకు గ్రంధాలయ భవనం ఏర్పాటు అయింది. మిగిలిన భూమిలో (స్థలం) కొంత స్థలాన్ని ఇతరులు ఆక్రమించారు. దీనిపై గ్రంధాలయాధికారులు కోర్టుకు వెళ్ళగా కోర్టులో స్థలం గ్రంధాలయానికి చెందినది అని తీర్పు వచ్చినట్లుగా అధికారులు చెబుతున్నారు. దీనిపై పాలకులు ఎలాంటి చర్యలు తీసుకొనక పోవడంతో అది ఆక్రమణల దారుల చేతిలోనే ఉండిపోయింది. గత 10 ఏళ్ళ క్రితం గ్రంధాలయ భవనం పూర్తిగా శిథిలావస్తకు గురై కూలిపోవడంతో వేలాది రూపాయలు చెల్లిస్తు అద్దె భవనంలోకి మార్చారు. కూలిన భవనం స్థానంలో నూతన భవనం నిర్మించేందుకు రూ.25 లక్షలు సిద్ధంగా ఉన్నట్లుగా అధికారులు చెబుతున్న గ్రంధాలయం భవన నిర్మాణానికి కలుగుతున్న ఇబ్బందులను తీర్చేందుకు నాయకులు ఎవరు ముందుకు రావడంలేదని తెలిసింది. కొంత మంది స్తానికులు, రిటైర్డ్ ఉద్యోగులు, ప్రజా సంఘాల నాయకులు జోక్యం చేసుకొని ప్రయత్నించగా వారికి బెదిరింపులు రావడంతో వారు మాకెందుకులే విరమించుకోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండిపోయింది. 50 వేలకు పైగా కలిగిన జనాభాకు పట్టణంలో విజ్ఞాన సంపదను అంధించే గ్రంధాలయం ఒక ఇరుకైన అద్దె భవనంలో ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లుగా పాఠకులు తెలుపుతున్నారు. ఇప్పటికైన పాలకులు జోక్యం చేసుకొని శిథిలమైన గ్రంధాలయంలో స్థానంలో అన్ని హంగులు కలిగిన నూతన భవనం నిర్మించి ప్రజలకు, విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఎంతైన ఉంది.



## అసెంబ్లీని తలపించేలా.. జడ్పీ సర్వసభ్య సమావేశం..!

- గత ప్రభుత్వంలో పంచాయితీ వ్యవస్థ నిర్వీర్యం
- జడ్పీటిసిలు వర్సెస్ ఎమ్మెల్యేల వాదోపవాదాలు






**కర్నూలు రూరల్, డిసెంబర్ 8, ప్రభాతవార్త:** ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో గ్రామీణ నీటి పారిశుద్ధ్యం, పంచాయితారాజ్‌శాఖ, విద్యుత్‌శాఖ అంశాల అజెండాపై సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా మంత్రి టీజీ భరత్, కర్నూలు జిల్లా కలెక్టరు పి రంజిత్ బాషా, నంద్యాల జిల్లా కలెక్టరు రాజకుమారి, ఎమ్మెల్యేలు పార్థసారధి, గౌరుచరితారెడ్డి, గిత్తా జయసూర్య, కెఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, కర్నూలు జేసి నవ్య, జడ్పీ సిఈఓ నాసరరెడ్డి, డిప్యూటి సికె వెంకటసుబ్బారెడ్డిలు పాల్గొన్నారు. ఈసందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్ర పరిశ్రమలు,ఫుడ్‌ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ వాటర్ స్కీంలో 40 శాతం లెస్‌తో రీ టెండర్ల ప్రక్రియపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని సంబంధిత అధికారులను అదేశించారు. రైతులకు ఇచ్చే ఇన్‌ఫుట్ సబ్సిడి విషయంలో అన్‌లైన్ సమస్యలు సాకుగా చూపకుండా రైతులకు తగు న్యాయం చేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. ఈసందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ గత సమావేశాల్లో సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం ఇచ్చారా లేదా సమాధానం రాకపోతే వాటిపై ముందుగా మాట్లాడాలని సభ్యులకు సూచించారు. అనంతరం అదోని ఎమ్మెల్యే పార్థసారధి మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రంలో పంచాయితీ రాజ్ వ్యవస్థకు నిధులు మంజూరు చేయకుండా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. తమ కూటమి ప్రభుత్వం ఇచ్చిన నిధులను సర ్పంచులు దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. 15వ ఆర్థిక సంఘం నిధులను రెండు దఫాలుగా సర ్పంచుల ఖాతాల్లోకి నేరుగా జమచేసిందని తెలిపారు. అయితే ఈనిధులను గత వైసీపీ ప్రభుత్వంలో చేసిన పనులకు వినియోగించుకొని దురి ్వనియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. దీంతో జడ్పీ సభ్యులు జోక్యం చేసుకొని ఎమ్మెల్యేపై వాగ్వివాదానికి దిగారు. నందికోట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మాట్లాడుతూ వాటర్ స్కీంలో జరిగిన అవినీతి అక్రమాలకు పాల్పడుతూ 40 శాతం లెస్‌తో రీ టెండర్ ప్రక్రియను రద్దుచేసి ఆ కాంట్రాక్టర్ జాబితాను బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. కొత్తపల్లి మండలంలో జనాలగూడెం, పిచ్చెరువు తండాలకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చామని తమ ప్రభుత్వం చేసిన ఘనతగా చెప్పారు. అనంతరం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ నందికోట్కూరు మండలం బ్రహ్మణకోట్కూరులో జడ్పీ హైస్కూల్ బాలుర వసతి గృహానికి సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటుచేశారని దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈదుకాణం తొలగించకపోతే విద్యార్థుల తల్లిదండ్రులు ఆత్మహత్యలు చేసుకోవడానికి సిద్ధమయ్యేపరిస్థితులు ఏర్పడతాయని నందికోట్కూరు జడ్పీటిసి షేక్ కలీమున్నీసా అవేదన వ్యక్తం చేశారు. నంద్యాల జిల్లా కలెక్టర్ స్పందిస్తు విచారించి నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చారు. పాఠశాలలో టీచర్ల కొరత కారణంగా విద్యార్థులు చదువులో వెనకబడుతున్నారని టీచర్లను నియమించే వారకు కనీసం విద్యా వాలింటర్ వ్యవస్థను ఏర్పాటుచేసి విద్యాబోధన సాగించాలని కొత్తపల్లి జడ్పీటిసి సుధాకర్‌రెడ్డి సమావేశం దృష్టికి తెచ్చారు. అనంతరం సర్వసభ్య సమావేశంలో జడ్పీ తీర్మాణాలకు సభ్యులు అమోదం తెలిపారు. సమావేశంలో కురువ కార్పొరేషన్ చైర్మన్, పంచాయితీరాజ్ ఎస్‌ఈ, వి రామచంద్రారెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ ఈ నాగేశ్వర్‌రావు, ఎపీఎస్పీడిసిఎల్ ఎస్‌ఈ కే ఉమాపతి, పిఆర్‌ఈలు మద్దన్న, వ్యవసాయశాఖ జిల్లా అధికారి వరలక్ష్మీ, డిపిఓ భాస్కర్, అయా శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పురుగుల మందు వ్యాపారంలో.. పచ్చి దగా..!

- ఆలూరులో లక్షలు దండుకుంటున్న వ్యాపారులు
- పంటల పై మా మందులు పిచికారి చేయ్యండంటూ మభ్య పెడుతూ ప్రచారం
- అప్పలపాలవుతున్న అన్నదాతలు

ఆలూరులో ఏటేటా లక్షల్లో పురుగు మందుల వ్యాపారం నిర్వహిస్తూ అన్నదాతలను నిలువు దోపిడీ చేస్తున్న వైనం పై ప్రభాతవార్త ప్రత్యేక కథనం ...

**ఆలూరు రూరల్, డిసెంబర్8, ప్రభాతవార్త:** ఆలూరు మండలంలో వందల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. వాటిలో ప్రధానంగా వాణిజ్య పంటలైన పత్తి, మిర్చి, వరి, మొక్కజొన్న, కంది, వేరుశనగ, పప్పుశనగ, కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు. ఆలూరులో ప్రధానంగా రూరల్ ప్రాంతమైన మొలగవెల్లి, అరికెర, కరిడిగుడ్డం, కురుకుంద, తుంబలబీడు, పెద్దహోతూరు ప్రాంతాల్లో ప్రధానంగా వాణిజ్య పంటలైన మిరప, పత్తి పంటలను సాగు చేస్తున్నారు. మిగతా ప్రాంతాల్లో బోరుబావుల కింద, పిల్ల కాలువల కింద



వరి పంటలను సాగు చేస్తున్నారు. వివిధ పల్లెల్లో, వివిధ ప్రాంతాల్లో ఖరీఫ్‌లో కొద్ది మొత్తంలో రబీలో అధిక మొత్తంలో మొక్కజొన్నను సాగు చేస్తున్నారు. ఈ పంటలకు సోకుతున్న చీడపీడల నివారణ పై ఏటా రైతులు పురుగు మందుల పై ఒక్క ఆలూరు మండలంలోనే దాదాపుగా కోటి రూపాయలకు పైగా ఖర్చు చేస్తున్నారు. ఆలూరు మండలంలో దాదాపుగా 20 నుండి 50 పురుగు మందుల షాప్‌లు ఉన్నాయి. వీటి ద్వారా రైతులకు వ్యాపారులు పోటీపడి పురుగుల మందులను అంటకడుతూ నిలువునా మోసం చేస్తున్నారు. అధిక దిగుబడుల కోసం ఆరాటపడుతున్న రైతులకు అవసరంలేని మందులు, కల్తీ మందులు అంటగట్టి సంస్థల నుంచి కొంత మంది వ్యాపారులు లక్షలాది రూపాయలు గడిస్తుంటే వాటి కోసం బోలెడంతా వ్యయం చేసి ఆదాయంలేక రైతులు అప్పులపాలవుతున్నారు. కోటి రూపాయల మేర విస్తరిస్తున్న ఈ వ్యాపారంలో నాణ్యత లోపాన్ని ప్రభుత్వ చట్టాలు, అధికారుల తనిఖీలు ఏమి చేయలేకపోతున్నాయి. అప్పుడప్పుడు రైతు సంఘాలు ఆందోళన చేస్తుండడంతో వ్యవసాయాధికారులు మొక్కుబడిగా తనిఖీలు నిర్వహిస్తుంటే మరి కొంత మంది అధికారులు మాత్రం వ్యాపారుల నుంచి మామ్ముళ్లు తీసుకుంటూ తమ జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆలూరు మండలంలో రైతులు వాణిజ్య పంటల సాగు పెంచడం కోసం పురుగు మందులు..

• వివరాలు 2లో

## ఇంజనీరింగు పనులు వేగవంతం చేయండి

**: ఈఓ శ్రీనివాసరావు**



**శ్రీశైలంప్రాజెక్టు,డిసెంబర్08ప్రబాతవార్త :** శ్రీశైలదేవస్థానంలో జరుగుతున్న ఇంజనీరింగ్ పనులను వీలైనంత త్వరితగతిన వేగవంతం చేయాలని శ్రీశైలందేవస్థానం కార్యనిర్వహణాదికారి యం.శ్రీనివాసరావు ఇంజనీరింగ్ అధికారులను అదేశించారు.పరిపాలనాంశాల సమీక్షలో బాగంగా ఆదివారంనాడు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఆలయప్రాంగణంలోని బండపరుపుకు వెంటనే తగు మరమ్మత్తులను చేయాలని తెలిపారు.అదే విధంగా అక్కమహాదేవి అలంకార మండపం నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయలన్నారు.జనవరిలో జరుగనున్న మకర సం క్రాతి బ్రహ్మోత్సవాలలోగా మండపం నిర్మాణపు పనులు పూర్తయ్యేవిధంగా చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అదికారులను ఆదేశించారు.మరమత్తుల సమయంలో ప్రాచీన నిర్మాణాలకు ఎలాంటి విఘాధం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈక్రమంలోనే గోసంరక్షణశాల పరిశీలనలో శుచీశుబ్రతకు అధికప్రాధాన్యత ఇవ్వాలన్నారు.అదే విధంగా పశువైద్యనిపుణులు సలహాలను కూడా తీసుకోవాలన్నారు. గోసంరక్షణశాల లోని గోవులన్నింటికి శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా పౌష్టికమైన ఆహారాన్ని అందించలన్నారు.ఈ పరిశీలనలో ఈఈ నరసింహారెడ్డి,డిఈఈ,తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లుకు షాక్!..

(మొదటి పేజీ తరువాయి ) :

గతంలో సుమారు 22 సంవత్సరాల క్రితం ఇదే తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో అంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2002 సంవత్సరంలో వైద్య, ఆరోగ్యశాఖలో మగ హెల్త్ అసిస్టెంట్ల నియామకం కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడం జరిగింది..ఈ నోటిఫికేషన్‌లో పదో తరగతిఉత్తీర్ణతతో శానిటరీ ఇన్స్‌పెక్టర్ శిక్షణ పొందిన వారు ఈ ఉద్యోగాలకు అర్హులుగా నిర్ణయించారు..అంతేకాక ప్రభుత్వం జరిపిన పరీక్షలల్లో భాగంగామెరిట్ జాబితాను జారీ చేసారు..అయితే కొంతమంది ఈ మెరిట్ జాబితాపై అభ్యంతరాలు తెలుపుతూ ఇంటర్మీడియెట్ పూర్తైన వారికే ఇవ్వాలంటూహైకోర్టుకు వెళ్లారు..దీంతో ఇంటర్ చదివిన అభ్యర్థులకే ఈ ఉద్యోగాలు ఇవ్వాలని హైకోర్టు 2002లో చెప్పడంతో మేరకు ఇందుకు అర్హులైన

కొందరు ఉద్యోగంలో చేరారు..ఇక ఇదే విషయంలో మెరిట్ జాబితాలోని కొందరు తిరిగి అదే కోర్టును ఆశ్రయించగా 2006లో పదో తరగతిచదివిన అభ్యర్థులు కూడా ఉద్యోగాలు పొందేందుకు అర్హులేనని తీర్పును చెప్పిన నేపథ్యంలో తిరిగి మెరిట్ జాబితాను తీసి మరి కొందరికిఉద్యోగాలు ఇచ్చారు..దీనిపై వైద్య, ఆరోగ్యశాఖలో వివాదం చోటు చేసుకుంది..ఇక 2012లో పదో తరగతితో పాటు ఇంటర్ అర్హతతో శానిటరీ ఇన్స్‌పెక్టర్ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థుల మెరిట్ జాబితాను తయారు చేసి నోటిఫికేషన్‌లో తెలిపిన ఖాళీలకు మాత్రమే ఉద్యోగాలు ఇచ్చారు..మిగిలిన వారిని విధుల నుండి తప్పించారు..ఈ నేపథ్యంలో వీరు ప్రభుత్వానికి మొరపెట్టుకోవడంతో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి మానవతా దృక్పదంతో ఉప సంఘం నివేధికతో తిరిగి వారిని 2013లో ఒప్పంద నిబంధనలతో తిరిగి విధుల్లోకి తీసుకున్నారు..అప్పటి నుండి జిల్లాలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలల్లో రోగులకు వైద్యసేవలను అందిస్తున్నారు..ఉద్యోగాలు కోల్పోయిన మరి కొందరుఉమ్మడి రాష్ట్రంలోని హైకోర్టులో వ్యాజం వేయడంతో ఈ కేసు కొన్ని ఏండ్ల నుండి హైదరాబాద్ హైకోర్టులో నడిచింది..ఈ కేసు పూర్వపరాలు పరిశీలించిన హైదరాబాద్ హైకోర్టు 2013లో ఒప్పందంతో నియామకమైన ఆరోగ్య కార్యకర్తలను తొలగించాలని ఉత్తరువ్యలు ఇచ్చింది.. అంతేకాక ఈకేసుకు సంబందించి తీర్పును అమలు చేసే విషయంలో ఆయా రాష్ట్రాల నిర్ణయాల మేరకు దీనిని అమలు చేసుకోవచ్చనే వెసులుబాటు ఉంటుంది. కానీ ఈ ఉత్తరువ్యలు వచ్చిన రాత్రికి రాత్రే కర్నూలు జిల్లాలోని 15 మందిని నంద్యాల జిల్లాలోని 8 మందిని వెంటనే ఉద్యోగాలల్లో నుండి తొలగించినట్లు సమాచారం..

**రెండు దశాబ్దాలుగా ఆరోగ్యశాఖకు ఊడిగం:**

వైద్య, ఆరోగ్యశాఖలో సుమారు రెండు దశాబ్దాలు అంటే 22 ఏళ్లు పాటు అతి తక్కువ జీతంతో ఆరోగ్యశాఖకు ఊడిగం చేసినట్లు కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్లు వాపోతున్నారు..ముఖ్యంగా ప్రపంచ దేశాలను గడగడలాడించిన కరోనా విజృంభన సమయంలో ప్రాణాలకు తెగించి రోగులకువైద్య సేవలను అందించినట్లు తెలిపారు..ముందస్తు సమాచారం లేకుండానే విదుల్లో నుండి తీసేయండంతో తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని తమకు ఆత్మహత్యలే శరణ్యమంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మరోసారి విచారణ చేపట్టి తమకు న్యాయంచేయాలని వేడుకుంటున్నారు..

**విధుల నుండి తొలగించబడిని(మగ)హెల్త్ అసిస్టెంట్లు:..**

కోసిగి పిహెచ్‌సిలో కూనే శ్రీధర్, కె.మహ్మద్ ఫారూక్, పలుకూరు పిహెచ్‌సిలో ప్రభాకర్, అహ్మద్ హుసేన్, అహోబిలం నారాయణస్వామి,తిరుమలేష్, రుద్రవరం కిరణ్‌కుమార్, సారనాథ్, గోకవరం కరుణాకర్, సుబాస్‌బాబు, హోళగుంద నాగరాజు, పెద్దహరివాణం సురేష్ కుమార్,గజ్జహళ్లి రంగన్న, నందవరం జయరాముడు, చాగలమర్రి చంద్రశేఖర్, బండిఆత్మకూరు రామకృష్ణుడు, వెలుగోడు బాలచంద్రుడు, సిరివెళ్లవెంకటేశ్వర్లు, కొలిమిగుండ్ల నరసింహుడు, కొత్తబురుజు శ్రీనివాసరెడ్డి, గడివేముల సురేష కుమార్, పేరుసోముల నరసింహులు వెలుగోడు బాలచంద్రుడులను విధులనుండి తొలగించినట్లు ఆయా పిహెషచ్‌సిల డాక్టర్లకు ఉత్తర్వులు అందాయి..

## తగ్గుముఖం పడుతున్న.. తెల్లబంగారం..!

(మొదటి పేజీ తరువాయి ) :

వేరుశనగ విత్తనాలు తూకాల్లో దోపిడీ ఇలా : వేరుశనగ విత్తనాలు హమాలీ కూలీ మార్కెట్‌యార్డు నిబంధనల ప్రకారం 10.50ఉండగా రైతు వాటా 5:25 ఉంది. కానీ ఆ విధంగా కాకుండ రైతు నెత్తిపై రూ.20నుండి రూ.30లను తూకం కూలీని వేస్తూ అంతేకాకుండ శనగ సంచులను మార్కెట్‌లో దింపేందుకు సంచికి రూ.3లు చొప్పున ఉండగా రూ.10ల నుంచి రూ.15లు వేస్తూ మనకు సంచికి 1:80ఉండగా రూ.5ల నుంచి రూ.10ల వరకు వసూలు చేస్తున్నారు. ఒక సంచి శుభ్రత కోసం ఒక్క రూపాయి ఉంటే రూ.5ల నుంచి రూ.10లు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా సంచులు బాదు అని 4కేజీలను తీస్తున్నారు. హమాలీలు రైతుల దగ్గర నుంచి ఖుషీ అనే పేరుతో 6నుండి 8కేజీలు ఆడ హమాలీలు 4నుంచి 6కేజీలను రైతుల ముక్కు పిండి తీసుకుంటున్నారని రైతులు వాపోతున్నారు. పత్తి తూకాల్లో ఇలా మోసం : మార్కెట్‌యార్డులో ఒక పత్తి చెక్కను దింపితే హమాలీకి రూ.13లు రైతుకు వేయాల్సి ఉండగా రూ.20ల నుండి రూ.30లు వేస్తున్నారు,కాటా వేస్తే 20:50ఉండగా రైతులకు మాత్రం రూ.20ల నుండిరూ.30లు వేస్తూ సు బ్రం కొరకు ఒక చెక్కకు కూలీ రూ.10లు వేమన్‌కు రూ.10లు వేస్తున్నారు. నిబంధనల ప్రకారం 200కేజీలపైన వస్తే రూ.33లు ఉంది కానీ ఆ విధంగా వేయకుండ నిబంధనలకు విరుద్దంగా రూ.100లను పట్టీలో వేసి రైతులను ఈ విధంగా నిలువుదోపిడీ చేస్తున్నారు.

**మార్కెట్‌యార్డు అధికారులు చోద్య చూస్తున్నారా..? :** రైతులను తూకంలోను మరియు హమాలీ కూలీలు వేయడంలో ఇలా మోసం చేసుకుంటూ పోతే రైతన్నను అడుగడుగునా లెక్కల్లో నిలువుదోపిడీ చేస్తూ రైతు డబ్బులను దోచుకుంటున్నారు. మార్కెట్‌యార్డు అధికారులు మాత్రం రైతులకు ఎలాంటి అవగాహన సదస్సులు మైక్‌లో చూపించడం కానీ స్టిక్కర్లు కనిపించడంలో కానీ రైతులకు ఎటువంటి అవగాహన సదస్సులు కల్పించకుండ చోద్యం చూస్తున్నారా అని ప్రజాసంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

**రైతులు మాకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం :** మార్కెట్‌యార్డు సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి రైతుల దగ్గర నుంచి కమీషన్ ఏజెంట్లు వడ్డీ పట్టుకొని ఇచ్చినట్టు తమకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని మార్కెట్‌యార్డు సెక్రటరీ తెలిపారు. అయితే ఇప్పటివరకు నాలుగు కేసులు పట్టుకొని ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానా విధించడం జరిగిందన్నారు. మళ్లీ వారిపై ఫిర్యాదులు వస్తే వారి యొక్క లైసెన్సులను రద్దు చేస్తామని అన్నారు. అలాగే రైతులకు మార్కెట్‌యార్డులో మైకులు వాల్‌పోస్టర్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎవరైనా కమీషన్ ఏజెంట్లు రైతులకు వడ్డీ డబ్బులు పట్టుకుని ఇస్తున్నట్లు ఉంటే రైతులు తమకు ఫిర్యాదు చేయవచ్చని అలాంటి కమీషన్ ఏజెంట్లపై చర్యలు తీసుకుంటామని మార్కెట్‌యార్డు సెక్రటరీ తెలిపారు.

## పురుగుల మందు వ్యాపారంలో.. పచ్చి దగా..!

(మొదటి పేజీ తరువాయి ) :

ఎక్కువగా వాడుతున్నారు. ఆయా పురుగు మందుల కంపెనీలు ఆలూరులో ప్రకటనలకు ఆకర్షితులవుతున్న రైతులు వేలాది రూపాయలు ఖర్చుచేస్తున్న చీడపీడల నివారణ కాకపోగా దిగుబడులు రాకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. అయితే కంపెనీలు పెట్టే ఆఫర్లు మరియు విహారయాత్రలకు అలవాటుపడిన ఫర్టిలైజర్స్ యజమానులు వారి టార్గెట్ రీచ్ కావడానికి రైతులకు నకిలీ మందులు మరియు సంబంధంలేని పిచికారి మందులను అంటగట్టి రైతులను నట్టేట ముంచుతున్నారు. ప్రధానంగా ఆలూరులో మిర్చి మరియు పప్పుశనగ పంటలను దాదాపుగా లక్ష ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా. ఎక్కువగా ఈ రెండు పంటలకే రైతులు పురుగు మందులు వాడుతున్నారు. అలాగే మునుపెన్నడులేని విధంగా ఆలూరు మండలంలో కంది మరియు పత్తి పంటలు ఎక్కువగా సాగు చేయడంతో వాటికి వచ్చే దోమపోటు వంటి రోగాలు పెరగడంతో వాటికి కూడా రైతులు అధిక మొత్తం ఖర్చు చేస్తున్నారు. రెండేళ్ల క్రితంతో పోలిస్తే ఈ వ్యాపారంలో ఆదాయం అధికంగా ఉండడంతో పట్టణ ప్రాంతాల నుంచి మొదలుకుని గ్రామీణ ప్రాంతాల్లో పురుగు మందుల విక్రయ దుకాణాలు జోరుగా వెలిసి మూడు పువ్వులు ఆరు కాయలుగా వ్యాపారం విరజిల్లుతూ రైతుల జేబులు ఖాళీ చేస్తున్నారు. పురుగు మందుల్లో కొన్నింటిలో కల్తీ పెరిగిపోయి నాణ్యత లోపించి రైతుల జేబులు ఖాళీ చేయడమే తప్ప రైతులకు ఆదాయం చేకూరడంలేదు. ప్రస్తుతం మార్కెట్‌లో 75 రకాలకు పైగా చీడపీడల నివారణ మందులు పలు రకాల కంపెనీల మందులు చలామణిలో ఉన్నాయి. లాభాలు ఎక్కువగా ఉండే మందులను విక్రయిస్తూ రైతులను కొల్లగొడుతున్నారు.

**రైతు ధనుంజయ అగ్రహారం :** నేను పది ఎకరాలు సాగు చేస్తున్నానని వాటిలో ఐదెకరాల్లో పచ్చిమిర్చి, ఐదెకరాలు కంది పంటలు సాగు చేస్తునాన్నన్నారు. అయితే ఈ పంటలకు లక్ష రూపాయలు వెచ్చించి పిచికారి మందులు కొనుగోలుచేసి పిచికారి చేయగా ఇప్పటిదాకా ఎలాంటి ఫలితం లేకుండా పోయిందన్నారు. ఈ పురుగు మందుల వాళ్ల ఎలాంటి ఫలితంలేదని ఫర్టిలైజర్స్ యజమానికి తెలుపగా వెళ్లినప్పుడల్లా అడిగిన మందులను ఇవ్వకుండా వేరే వేరే మందులను అంటగట్టి ఎలాంటి ఫలితం లేకుండా చేశారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అయితే కొందరు వ్యాపారులు రైతులకు నాణ్యతలేని మందులు అంటగడుతూ మోసం చేస్తున్నప్పటికి వ్యవసాయశాఖ అధికారులు నిఘా పెట్టి కట్టడి చేయాల్సిందిపోయి ఆ అధికారులు వారికే వత్తాసు పలుకుతున్నారని నేను ఫిర్యాదు చేయడానికి వెళ్లగా అధికారులు ముందుగానే వ్యాపారస్తులకు సమాచారం ఇచ్చి శాంపిల్స్‌ను దుకాణాల నుండి సేకరించి నాణ్యతకు పంపిస్తున్నామని తెలుపుతున్నారని ఆయన ఆరోపించారు. వ్యవసాయశాఖ అధికారులు ఇప్పటికైనా నిఘా ఉంచి నకిలీ మందులను విక్రయించే ఫర్టిలైజర్స్ షాప్‌ల పై చర్యలు తీసుకోవాలని ఆయన కోరుతున్నారు. ఇప్పటికైనా జరుగుతున్న మోసాన్ని నివారించి అరికట్టాలని అన్నదాతలకు అండగా నిలవాలని వివిధ ప్రజా సంఘాలు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు. ఈ విషయం పై వ్యవసాయాధికారి వెంకటేశ్వర గౌడ్‌ను ప్రభాతవార్త వివరణ కోరగా నకిలీ పురుగు మందుల విక్రయాలు జరుగుతున్నట్లు నా దృష్టికి వస్తే లేదా నకిలీ పురుగు మందులు వాడిన రైతులు తగిన ఆధారాలతో నా దృష్టికి తీసుకువస్తే ఆ షాప్‌ల పై తగిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



## శృతి ముప్పస్వామికి ప్రత్యేక పూజలు

**ఆదోని, డిసెంబరు 8, ప్రభాతవార్త**

మండల పరిధిలోని బల్లెకల్ గ్రామంలో కార్తీకమాస పూజ సందర్భంగా శృతి ముప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, మాజీ ఇంచార్జ గుడిసె ఆది కృష్ణమ్మ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆమెకు

## సురేష్ మృతి బాధాకరం

**- మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి**



**బనగానపల్లెరూరల్, డిసెంబర్8, ప్రభాతవార్త:** బనగానపల్లె మండలంలోని ఇల్లూరుకొత్తపేట గ్రామానికి చెందిన చిదిగే సురేష్ ఆకస్మికంగా మృతి చెందడం చాలా బాధాకరమని బనగానపల్లె గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు సురేష్ వస్త్ర వ్యాపారం నిమిత్తం విజయనగరం జిల్లా సాలూరుకు వెళ్లడం జరిగింది. అక్కడ ఈనెల 5వ తేది ఉదయం కరెంట్ షాక్‌కు గురై సురేష్ ఆకస్మికంగా మృతి చెందాడు. అయితే శనివారం సాయంకాలం ఇల్లూరుకొత్తపేటలో సురేష్ భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న బీసీ రాజారెడ్డి ఆదివారం ఉదయం ఇల్లూరుకొత్తపేట గ్రామానికి చేరుకుని సురేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. బతుకుదెరువు కోసం సాలూరుకు వెళ్లిన సురేష్ విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందడం తనను కలిచివేసిందన్నారు. సురేష్ కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ధైర్యం చెప్పి వారికి భరోసా కల్పించారు. బీసీ రాజారెడ్డి వెంట ఇల్లూరుకొత్తపేట గ్రామ తేదేపా నాయకులు ఉన్నారు.

## గ్రామీణ ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ గ్రామసభ



**సిబెళగల్, డిసెంబర్8, ప్రభాతవార్త:** సిబెళగల్ పట్టణంలోని సచివాలయం-2లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ గ్రామసభ సర్పంచ్ పాండురంగన్న, పంచాయతీ సెక్రటరీ లక్ష్మికాంత్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మేరకు 2023-2024లో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామంలో జరిగిన పనులను పరిశీలించి వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అలాగే ఉపాధి హామీ పథకం మేటీలు, ఉపాధిహామీ పథకం కూలీలు, టెక్నికల్ అసిస్టెంట్లతో జరిగిన పనుల పై చర్చించారు. అలాగే ఈ సంవత్సరాలు ఎన్ని నిధులు విడుదలయ్యాయి, ఎన్ని నిధులు ఖర్చు చేసి, ఏ మేరకు పనులు చేశారని గ్రామసభలో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రామన్న, టెక్నికల్ అసిస్టెంట్లు, మేటీలు, ఉపాధిహామీ పథకం కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## ఇటిక్యాల గ్రామంలో రోడ్డు గుంతల పూడిక



**కొలిమిగుండ్ల, డిసెంబర్8, ప్రభాతవార్త:** కొలిమిగుండ్ల మండల పరిధిలోని ఇటిక్యాల గ్రామంలో రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇటిక్యాల గ్రామ టీడీపీ నాయకుడు తోట శివారెడ్డి, తోట పరమేశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలోని రోడ్ల పై ఉన్న గుంతలను పూడ్చి వేసే కార్యక్రమం చేపట్టారు. రోడ్డు పై గుంతలు ఎక్కువగా ఉండడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి గ్రామంలో రోడ్డు పై గుంతలను పూడ్చే వేసే కార్యక్రమం చేపట్టినట్లు గ్రామ టీడీపీ నాయకుడు తోట శివారెడ్డి తెలియజేశారు.

## ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలి



**గోనెగండ్ల డిసెంబరు 8 ప్రభాతవార్త :** ప్రభుత్వం ఇరిగేషన్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని ఎపీ ఇరిగేషన్ ఎల్లెల్సీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామేశ్వరరెడ్డి. మగ్బుల్ బాషా,జిల్లా అధ్యక్షుడు అంజినయ్య, డిమాండ్ చేశారు.ఆదివారం ఎల్లెల్సీ ఇరిగేషన్ సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డివిజన్ సంఘం ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.సంఘం అధ్యక్షుడుగా గులామ్ వోదిన్,ప్రధాన కార్యదర్శిగా ఉగ్రనరసింహులు,కోశాధికారిగా క్రిష్టంనాయుడు,వర్కింగ్ ప్రెసిండెంట్‌గా మాదన్న,ఆర్గనైజింగ్ కార్యదర్శిగా చంద్రశేఖర్,ఎపాధ్యక్షుడుగా వన్నురుస్వామి, మల్లికార్జున, తిరుమలేష్,గౌరవ అధ్యక్షుడుగా అంజినయ్య,సలహాదారుడిగా రామేశ్వరరెడ్డి,అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా పీరసాహెబ్‌లు ఎన్నికయ్యారు.

## ఉత్తమ సిమెంటుకు డీలరుకు ఘనంగా సన్మానము

**కోవెలకుంట్ల, డిశంబరు 8, ప్రభాతవార్త**




సిమెంటు తయారి రంగములో అనతి కాలంలో అన్నింటి కంటే ముందు వరుసలో నిలిచిన రాంకో సిమెంటు కర్మాగారము డీలర్లను ఘనంగా సన్మానించారు.అందులో బాగంగా రాంకో సిమెంటు అమ్మకాల్లో మేటిగా నిలిచిన గడ్డం శేషారెడ్డిని మేనేజరు అదివారము ఘనంగా సన్మానించారు.సిమెంటు తయారిలో నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం పేరొంది, నూనతంగా తయారి ప్రారింబించిన కూడా నాణ్యతలో అన్నింటికంటే ముందు వసరుసలో నిలిచి వినియోగదారును అకకట్టుకుంటున్న రాంకో అమ్మకము దారులను సన్మానించే కార్యాక్రమలో కోవెలకుంట్లకు చెందిన గడ్డం శేషారెడ్డి రీజన్‌లో మొదటి స్థానము సాదించారు అందులో బాగంగా అయనను అదివారము యాజమాణ్యము తరుపున మేనేజరు శాలువ కప్పి ఘనంగా సన్మానించి శీల్లును బహూకరించారు.

## వాల్మీకుల ఎస్‌టి రిజర్వేషన్ కోసం కృషి చేయాలి

**ఆదోని, డిసెంబరు 8, ప్రభాతవార్త**



రాష్ట్రంలో వివిధ హోదాల్లో ఉన్న వాల్మీకి నాయకులు వాల్మీకుల ఎస్‌టి రిజర్వేషన్ కోసం కృషి చేయాలని ఏపివిబిఎస్ డివిజన్ అధ్యక్షుడు ఫర్టిలైజర్ వీరేష్ వాల్మీకి, నాయకులు వెంకన్న, అంజి, రాజు, వాల్మీకి నగర్ వీరేష్, రఘులు అన్నారు. ఏపివిబిఎస్ ఆధ్వర్యంలో ఆదివారం వాల్మీకి నాయకులు ఎమ్మెల్సీ బిటి నాయుడును కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు తమవంతు కృషి చేయాలన్నారు. స్పందించిన ఎమ్మెల్సీ బిటి నాయుడు వాల్మీకుల రాజ్యాధికారం కోసం తనవంతు పోరాటం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## రైతులు ప్రీమియం చెల్లించాలి



**కొత్తపల్లి, డిసెంబర్ 8, ప్రభాతవార్తః** ఉద్యానపంటలైన మామిడి, ఉల్లికి వాతవారణ అధారిత భీమా కోసం రైతులు ప్రీమియం చెల్లించాలని ఉద్యానశాఖాధికారి కె చందన న్న సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో ఆమె మాట్లాడుతూ ఉద్యాన పంటలు సాగుచేసుకుంటున్న ప్రతిరైతు పంట నష్టం జరిగినప్పుడు పరిహారం పొందేందుకు ఇన్సురెన్స్ ప్రీమియం చెల్లించుకోవాలన్నారు. వాతావరణంలోవచ్చే మార్పుల వల్ల పంట నష్టం జరిగితే కేంద్ర ప్రభుత్వం అగ్రికల్చరల్ ఇన్సురెన్స్ కంపెనీ అఫ్ ఇండియా లిమిటెడ్ వారి ద్వారా వాతావరణ అధారిత ఉద్యాన పంటలకు భీమాను అందిస్తుందన్నారు. అందుకోసం మామిడికి ఎకరాకు రూ.2250 చెల్లిస్తే రూ.45 వేలు, ఉల్లిపంటకు ఎకరాకు రూ.90లు ప్రీమియం చెల్లిస్తే రూ.45 వేలు పంట భీమా వర్తింపచేయడం జరుగుతుందన్నారు. ఈప్రీమియం మొత్తాన్ని ఈనెల 15లోపు రైతులు బ్యాంకు, కామన్ సర్వీస్ సెంటర్, మీ సేవా, భీమా కంపెనీ నియమించిన మధ్యవర్తుల ద్వారా ప్రీమియం చెల్లించాలని చెప్పారు. రైతులు కూడ నేరుగా పిఎంఎఫ్‌బివై పోర్టల్‌లో మొబైల్ నుంచి కూడ ప్రీమియం చెల్లించవచ్చని వివరించారు. ఈఅవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**దేవనకొండ, డిసెంబరు 8, ప్రభాతవార్త**



దేవనకొండ గ్రామానికి చెందిన పెద్దలాలప్ప భార్య వీరమ్మ మృతిచెందడం జరిగింది. టిడిపి సభ్యత్వం కలిగి ఉన్నందున దేవనకొండ గ్రామ టిడిపి పార్లమెంట్ కార్యదర్శి ఆకుల వీరేష్, సర్పంచ్ భర్త బండ్లయ్య, రాజాసాహెబ్, మస్తాన్, మజీద్, రాముడు తదితరులు రూ.5వేలు ఆర్థిక సహాయం అందచేసి ఆమె మృతికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## నిత్యన్నదాన వితరణ,గో సంరక్షణకు దాతలు విరాళం

**శ్రీశైలంప్రాజెక్టు, డిసెంబర్08, ప్రభాతవార్త**



శ్రీశైలం మహాపుణ్యక్షేత్రంలో దేవస్థానం ఆధ్యర్యంలో నిర్వహిస్తున్న నిత్యఅన్నదాన వితరణ పథకంనకు ఆదివారంనాడు రాజమహేంద్రవరం వాస్తవ్యులు ఎస్.ఎల్.నరసింహ మూర్తి కుటుంబ సభ్యులు రూ.1,01,116/-ల విరాళమును పర్యవేక్షకురాలు టి.హిమబిందుకు దాతలు అందజేసారు.అదే విధంగా నల్గొండ వాస్తవ్యులు ఎస్.నారయణ వర్మ కుటుంబ సభ్యులు గో సంరక్షణ పథకంనకు రూ.1,00,116/-ల విరాళంను అందజేసారు.విరాళంను దాతలు విడివిడిగా అందజేయడం జరిగింది.విరాళం అందజేసిన దాతలకు దేవస్థానం తరుపున తగు రశీదు,ప్రసాదాలు,శేషవస్త్రం అందజేసి ఘనంగా సత్కరించారు.

## ఎస్సీ, ఎస్టీ కేసులో నిందితులను అరెస్టు చేయాలి

**- ఎమ్మార్పీఎస్ నాయకుల డిమాండ్**




**హాలహర్వి, డిశంబర్08, ప్రభాతవార్త;** మండలంలోని గూళ్యం గ్రామంలో దళితవర్గానికి చెందిన ఉమేష్‌పై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ డివిజన్ అధ్యక్షులు యల్లప్ప, తాలూకా అధ్యక్షులు కత్తి రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు మండలకేంద్రమైన హాలహర్విలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో రోజురోజుకు దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని తెలిపారు. గూళ్యం గ్రామంలో బోయ వర్గానికి చెందిన కొంతమంది దళిత ఉమేష్‌పై దాడి చేయడంతో ఉమేష్ తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. ఉమేష్‌పై దాడిచేసిన బోయ వర్గం వారు ఎస్సీ, ఎస్టీ కేసు నుంచి తప్పించుకోవడానికి ఆసపత్రిలో చికిత్స పొందుతున్న ఉమేష్‌పై తప్పుడు కేసు పెట్టి కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని వారు ఆరోపించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉమేష్‌పై పోలీసులు తప్పుడు కేసు నమోదు చేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ కేసును తప్పుదోవ పట్టించడానికే పోలీసులు ఉమేష్‌పై అక్రమకేసు నమోదు చేశారన్నారు. ఉమేష్‌పై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయకపోతే ధర్నా చేస్తామని హెచ్చరించారు.

## వృద్దులకు చలికోట్లు పంపిణీ

**- చిన్నారులను అభినందించిన వెల్దుర్తి సేవాసమితి, హెల్పింగ్‌హ్యాండ్స్ సొసైటీలు..**

**వెల్దుర్తి, డిసెంబర్8, ప్రభాతవార్త**



వెల్దుర్తి పట్టణంలో ఉర్దూ పాఠశాల సమీపంలో పూరి గుడిసెలో నివాసముంటున్న ఇద్దరు వృద్ధ మహిళలకు ఆదివారం రాత్రి చిన్నారులు అర్షద్, అర్షన్‌లు వెల్దుర్తి సేవాసమితి, హెల్పింగ్‌హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో హరిసింహానాయుడుతో కలిసి చలికోట్లు(స్వెటర్లు) పంపిణీ చేశారు.ఈ సందర్భంగా హారిసింహానాయుడు మాట్లాడుతూ ఇదివరకు పట్టణంలోని వృద్దులకు, అనాధలకు ఆ చిన్నారులు తనతో కలిసి దుప్పట్లు పంపిణీ చేశారన్నారు.ఆ సమయంలో ఆ వృద్దులు అప్పుడో ఇప్పుడో కూలిపోయే పూరి గుడిసెలో కాలం వెళ్లదీస్తున్నామని,తమకు స్వెటర్లు ఇప్పించండని చెప్పారు.అది గ్రహించిన చిన్నారులు ఇంట్లో తల్లితండ్రులు ఇచ్చిన డబ్బులు ఖర్చు చేయకుండా దాచుకొని వారి డబ్బులతో స్వెటర్లు కొనుగోలు చేసి ఇలా పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు.ఆ చిన్నారులను వెల్దుర్తి సేవాసమితి, హెల్పింగ్‌హ్యాండ్స్ సొసైటీ తరపున అభినందిస్తున్నామన్నారు.సమాజంలోని ప్రతి ఒక్కరు లేనివాళ్లకు తమ వంతుగా తమ వద్ద ఉన్న దాంట్లో సహాయ సహాకారాలు అందించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

## శ్రీగిరిలో సాంస్కృతిక కార్యక్రమాలు



**శ్రీశైలంప్రాజెక్టు, డిసెంబర్08 ,ప్రభాతవార్త :** శ్రీశైలం దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా(నిత్య కళారాధన కార్యక్రమంలో బాగంగా)ఆదివారంనాడు శ్రీనటరాజ కూచిపూడి కళానిలయం,హైదరబాద్ వారిచే సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది.కాగా ఆలయ దక్షిణ మాడవీదిలోని నిత్యకళారాధన వేదిక వద్ద సాయంకాలం నుండి ఈ సంప్రదాయ నృత్య కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గణపతి కౌతవ ం,మూషికవాహన, వక్రతుండం, భో...శంభో.తాండవ గణపతి,అంబాస్తుతి,శంభో..శివశంభో తదితర గీతాలకు నిత్యశ్రీ,సహస్ర, లిఖిత,భారతి,కీర్తన, శ్రవంతి,రజని,లావణ్య తదితరులు నృత్యప్రదర్శన చేసారు.కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజు హరికథ,బుర్రకథ,సం ప్రదాయ నృత్యం,వాయిద్య సంగీతం,భక్తి రంజిని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్ని పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాదన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

## ఉదారతను చాటుకున్న 1988-89 బ్యాచ్ పదోతరగతి పూర్వపు విద్యార్థులు

**- తోటి మిత్రురాలి చికిత్సకై రూ.20వేల రుపాయలు ఆర్థికసహాయం**

**వెల్దుర్తి, డిసెంబర్8, ప్రభాతవార్త**



తమతో చదువుకున్న తోటి మిత్రురాలు కిడ్నీ సంబంధ వ్యాధితో తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న 1988-89 బ్యాచ్ పదోతరగతి పూర్వపు విద్యార్థులు ఆర్థికసహాయం అందించి ఉదారతను చాటుకున్నారు.ఇటీవలి కాలంలో పూర్వపు విద్యార్థులు దాదాపు 35 సంవత్సరాల తర్వాత తాము చదువుకున్న పాఠశాలలో పూర్వపువిద్యారులు అంతా కలుసుకొని ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు.తమకు చదువు చెప్పిన గురువులను పిలుచుకొని సన్మానం చేసి ఆశీర్వాదాలు పొందారు.ఆ సమయంలో ఒకరి బాగోగులు ఒకరు తెలుసుకొని ఆరోగ్యపరంగా, ఆర్థికపరంగా ఇబ్బందులు పడుతున్న వారికి సహాయ సహాకారాలు అందించాలని నిర్ణయించుకున్నారు. తమతో పాటు చదువుకున్న వెల్దుర్తికి చెందిన తంబల రాజేశ్వరికి రెండు కిడ్నీలు పాడైనట్లు వైద్యులు తెలిపారని ఆమె వైద్యసేవలు పొందుతూ ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న పూర్వపు విద్యారులు ఆదివారం ఆమె ఇంటికి వెళ్లి తమవంతుగా వైద్యఖర్చులకై రూ.20వేల నగదును ఆమెకు అందించారు.రాబోవు రోజుల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమకు తెలపాలని ఆమెకు ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో పూర్వపువిద్యార్థులు, హెల్పింగ్‌హ్యాండ్స్ అధ్యక్షులు హరిసింహానాయుడు, శ్యామల,సువర్ణ, భారతి,షేక్షావలి, బ్రహ్మానందరెడ్డి, బషీర్‌అహ్మద్,పామయ్యయాదవ్, జయన్నఆచారి, ఖలీల్‌బాష(జెకె),జి.హరినాథ్,మల్లికార్జునరెడ్డి,పెద్దరజాక్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అడ్డ పల్లకి మహోత్సవం



**హాలహర్వి, డిశంబర్08, ప్రభాతవార్త;**

మండలంలోని జె.హోసల్లి గ్రామంలో లక్ష దీపోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం శ్రీ పట్టదస్వామి అడ్డ పల్లకి మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారికి ఆకుపూజలు, పంచామృతాభిషేకం, జలాభిషేకం, గంగాపూజ తదితర పజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి మంగళహారతులు, కోలాట, నందికోలు తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి అడ్డపల్లకిని ఊరేగించారు. పీఠాధిపతి శంభులింగస్వామి దైవ సందేశాన్ని బోధించారు. సోమవారం శ్రీ పట్టదస్వామి లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని శంభులింగస్వామి తెలిపారు.

# ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాయుడుని నియమించాలి

**ఆదోని,డిసెంబరు 8,ప్రభాతవార్త**

ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాయుడుని నియమించాలని ఎస్టియు రాష్ట్ర కౌన్సిలర్, అకాడమిక్ కమిటీ సభ్యులు మహదేవప్ప అన్నారు. ఆదివారం ఎస్టియు భవన్ నందు ఎస్టియు ఆదోని,కౌతాళం మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల అధ్యక్షుడు చింతకుంట రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే విద్యాసంవత్సరం నుంచి మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేయబోతున్నందున ఆ పాఠశాలలో 110మంది విద్యార్థులు ఉన్న ప్రతి ప్రాథమిక పాఠశాలలో సీనియర్ ఎస్జీటీలుగా ఉన్న ఉపాధ్యాయులను



పదోన్నతి ద్వారా ప్రాథమిక పాఠశాలల హెడ్మాస్టర్లుగా(పిఎస్ హెచ్ఎం)నియమించాలని డిమాండ్ చేశారు. బల్లెకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం,సీనియర్ నాయకులు సత్యన్న మాట్లాడుతూ పాఠశాలల్లో అపార్‌లో ఉన్నటువంటి ఇబ్బందులను సరిదిద్ది అవసరమైతే పాఠశాల ఆవరణలో మొబైల్ ఆధార్ సెంటర్‌లో ఏర్పాటు చేసి విద్యార్థుల యొక్క ఆధార్‌లో ఏర్పడినటువంటి ఇబ్బందులను సరిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే నన్నారు. అనంతరం జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి యంసి సుంకన్న మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు జిల్లా కార్యదర్శి గోపాల్,జిల్లా ఆర్థిక కమిటీ సభ్యుడు రామాంజనేయులు,ఆదోని మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్,ఆర్థిక కార్యదర్శి షేక్షావలి,కౌతాళం మండల నాయకులు ఆంజనయ్య,మండల నాయకులు ఎస్ఎస్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు సౌకర్యవంతంగా ఎంఎస్ ఫంక్షన్‌హాల్

**- మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి**



**బనగానపల్లెరూరల్, డిసెంబర్8, ప్రభాతవార్త:**

బనగానపల్లె పట్టణంలోని స్థానిక జీఎం టాకీస్ కూడలి సమీపంలో ఏర్పాటుచేసిన ఎంఎస్ ఫంక్షన్‌హాల్ అందరికి సౌకర్యవంతంగా ఉందని బనగానపల్లె గ్రామ పంచాయతీ మాజీ సర ్పంచ్ బీసీ రాజారెడ్డి తెలిపారు. ఆదివారం ఎంఎస్ ఫంక్షన్‌హాల్ ప్రారంభోత్సవానికి బీసీ రాజారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా బీసీ రాజారెడ్డి అక్కడికి చేరుకోగానే ఫంక్షన్‌హాల్ నిర్వాహకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎంఎస్ ఫంక్షన్‌హాల్‌ను బీసీ రాజారెడ్డి చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఫంక్షన్‌హాల్ మొత్తం కలియ తిరిగి అందరికి సౌకర్యవంతంగా రూపొందించారని నిర్వాహకులను అభినందించారు. బనగానపల్లె పట్టణంలో అందరికి సౌకర్యవంతంగా అందుబాటులో ఫంక్షన్‌హాల్‌ను ఏర్పాటు చేయడం శుభసూచికమన్నారు. ఈ మేరకు శుభకార్యాలు నిర్వహించుకునేవారు ఈ ఫంక్షన్‌హాల్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీసీ రాజారెడ్డి ఫంక్షన్‌హాల్ నిర్వాహకులు ఏర్పాటుచేసిన అతిథ్యాన్ని స్వీకరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెల్‌కల్ ఫోటోస్టూడియో అల్తాఫ్, అహమ్మద్ హుస్సేన్, టిప్‌టాప్ కలాం, ఇస్మాయిల్ ఖాన్, నియాజీ హుస్సేన్, బీసీ కుటుంబ అభిమానులు పాల్గొన్నారు.

## పెళ్లి వేడుకల్లో టిడిపి జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



**పెద్దకడుబూరు,డిసెంబరు 8,ప్రభాతవార్త**

మండల పరిధిలో చిన్నతుంబళం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు సిద్దప్ప కూతురు వివాహానికి ఆదివారం టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. తిక్కారెడ్డి పెళ్లి వేడుకలకు వస్తున్నారన్న విషయం తెలుసుకున్న ఆయన అనుచరులు,ఆయా గ్రామాల టిడిపి నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా పెద్దకడుబూరు మండల రాజకీయ విషయాలు,అభివృద్ధి పనులు తన అనుచరులతో చర్చించారు. పలు సమస్యలను ఆయా గ్రామాల టిడిపి నాయకులు తిక్కారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో కౌతాళం టిడిపి నాయకులు చెన్నబసప్ప,పెద్దకడుబూరు మండల కార్యదర్శి దశరథరాముడు, వీరేష్‌గౌడ్,చంద్ర,బద్రి,మాజీ ఎంపిటిసి ఈరన్న,విశ్వనాథ్‌గౌడ్,కటికె బాబు,రెహమాన్,ఐటిడిపి సభ్యులు కురువ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ వర్కర్స్ సమస్యలు పరిష్కారించాలని వినతి పత్రం



**నందికొట్కూరు,డిసెంబర్ 8,ప్రభాతవార్త:** మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ సమస్యలు పరిష్కారించాలని కోరుతు స్తానిక కార్యాలయం వద్ద ధర్నా చేసి అనంతరం డాక్టర్. బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి వర్కర్స్ వినతి పత్రం అందజేశారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మాట్లాడుతు మున్సిపల్ కార్మికులకు, కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందదజేస్తున్న సంక్షేమ పథకాలు ఇవ్వాలని, జీవో నెం. 36 ప్రకారం పారిశవుధ్య కార్మికులకు అంజేస్తున్న వేతనం ప్రకారం ఇంజనీరింగ్ సెక్షన్ లో పనిచేస్తున్న వర్కర్స్‌కు ఇవ్వాలని, 25 ఏళ్ళుగా పనిచేస్తు ధుర్భరమైన జీవితం గడుపుతున్నామని కావున ప్రభుత్వాలు స్పంధించి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు సర్వర్‌ఖాన్, పరమేష్, శివ, సుబ్బయ్య, చాంద్‌బాషా, నాగరాజు,శ్రీనువాసులు, శ్రీరాములు, ఇబ్రహీం, వస్తాన్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## దేవరగట్టులో అభివృద్ధి పనులు



**హొళగుంద,డిసెంబరు 8,ప్రభాతవార్త**

రాష్ట్రంలో ఎంతో ప్రసిద్ధిగాంచిన దేవరగట్టు ఆలయ ఆవరణలో ఆలూరు నియోజకవర్గ ఇంచార్జ వీరభద్రగౌడ్ ఆదేశాల మేరకు నూతన సిసిరోడ్లకు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు రాజానాయక్,తిమ్మయ్య,నర్సానాయక్,మల్లయ్య,మల్లికార్జున,చిన్న డాక్యనాయక్,పెద్ద డాక్యానాయక్,చాకలి బీరప్పలు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు,డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌లతో రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గ్రామాల్లో ఎటుచూసినా సిసిరోడ్లు,డ్రైనేజీల పనులు జరుగుతున్నాయన్నారు. అలాగే దేవరగట్టు ఆలయ ఆవరణలో రూ.10లక్షలతో సిసిరోడ్ల పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రస్తుతానికి రూ.10లక్షలతో పనులు చేపట్టామని మున్ముందు మరిన్ని నిధులతో అభివృద్ధి పనులు చేపడతామని వారు తెలిపారు. టిడిపి ఇంచార్జ వీరభద్రగౌడ్ ఆలూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



**నందికొట్కూరు,డిసెంబర్ 8,ప్రభాతవార్త:**

పట్టణంలోని సి.ఎస్.ఐ.చర్చ్ నందు ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింధి. క్రిస్మస్ సంధర్భంగా చర్చ్ కమిటీ మరియు స్వామిదాస్ రవికుమార్ ఆధ్వర్యంలో జయలక్ష్మి నేత్రాలయ కరూక్నలు వారి సౌజన్యంతో మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని రెవ.శామ్యూల్ రత్నరాజ్,రెవ.మోహన్‌రాజ్ ప్రార్ధనలు చేసి లాంచనంగా ప్రారంభించారు. డా.జె.జె.ప్రవీణ్ దాదాపు 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణి చేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి కర్నూలులోని నేత్రాలయలో ఆరోగ్యశ్రీ, ఎంప్లాయిస్ హెల్త్‌కార్డు ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని డాక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆప్తమిస్ట్ అరుణ్, ప్రవీణ్, మేనేజర్ శ్రీనివాసరాజు, చర్చ్ కమిటీ సెక్రటరీ జాన్‌క్రిసోస్టమ్, ట్రెజరర్ జయచంద్ర, కమిటీ సభ్యులు రవి జయప్రకాష్, ఫ్రాన్సిస్, ప్రదీప్, స్త్రీల మైత్రి సభ్యులు దేవకుమారి,ఏసుపాదమ్మ,సువర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కంబదహాల్ ఉపాధ్యాయులను విచారిస్తాం..!

**- మండల విద్యాధికారి రామ్మూర్తి**

**పెద్దకడుబూరు,డిసెంబరు 8,ప్రభాతవార్త**



మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలో శనివారం మెగా పేరెంట్స్ డే మరియు ఉపాధ్యాయుల సమావేశం సందర్భంగా పాఠశాలలో 'మెగా పేరెంట్స్'కు అవమానం అనే శీర్షిక వార్త దినపత్రికలో ప్రచురితం కావడంతో ఆదివారం మండల విద్యాధికారి-2 రామ్మూర్తి స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్ డే వేడుకలు నిర్వహించారని కంబదహాల్‌లో ఎందుకు అలా జరిగిందో పాఠశాలకు వెళ్లి అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులను విచారిస్తామన్నారు. ఏదైన ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహిస్తే ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలు తప్పనిసరిగా పాటించే విధంగా చూస్తామన్నారు.

## రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్న కుక్కలు,పశువులు..!

**- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు,ప్రజలు**

**- పట్టించుకునేనాథుడే కరువయ్యాడు..**



**పత్తికొండ,డిసెంబరు 8,ప్రభాతవార్త :**

పత్తికొండ పట్టణంలో మెయిన్‌రోడ్డులో కుక్కలు,పశువులు విచ్చలవిడిగి తిరుగుతున్నాయి. రోడ్లపై కుక్కలు,పశువులు ఎక్కువగా తిరుగుతుండడం వల్ల అవి వాహనాలకు అడ్డంగా రావడంతో వాహనదారులు,ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. పశువులు దుకాణాల వద్ద ఆహారాన్ని తినడానికి వెళ్లినప్పుడు ఆ దుకాణ యజమానులు,సిబ్బంది ఆ పశువులను అల్లించడం వల్ల అటువైపు రోడ్డులో వెళ్తున్న వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. అలాగే చిన్నపిల్లలు బ్యాగులు తీసుకొని పోతుండగా వీధి కుక్కలు వెంటబడి కరుస్తున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. పశువులు,వీధి కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతున్నా పట్టించుకునేనాథుడే కరవయ్యారన్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు వీధి కుక్కలు,పశువుల బారి నుండి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## శ్రీగిరిలో వైభవంగా పల్లకీ ఉత్సవం



**శ్రీశైలంప్రాజెక్టు,డిసెంబర్08,ప్రభాతవార్త**

లోక కల్యాణం కోసం దేవస్థానం శ్రీస్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవం నిర్వహించడం జరిగింది.ఈ పల్లకీ ఉత్సవం ప్రతి ఆదివారం,పౌర్ణమి మరియు మూల నక్షత్రం రోజులలో దేవస్థాన సేవగా(సర్కారి సేవగా)జరిపించబడుతోంది.ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా అమ్మవారి ఆలయ ఆశీర్వచన మండపంలో లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠించారు.తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహగణపతి పూజ జరిపించబడింది.అనంతరం శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో వేంచేబు చేయించి శాస్రోక్తంగా షోడశోపచారపూజలు జరిపించబడ్డాయి.

## మాలమల్లేశ్వరుడికి ప్రత్యేక పూజలు



**హొళగుంద,డిసెంబరు 8,ప్రభాతవార్త**

మండల పరిధిలోని దేవరగట్టులో ఎత్తైన కొండల్లో వెలసిన దేవరగట్టు శ్రీ మాలమల్లేశ్వర స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు జయమల్లప్ప స్వామి,మల్లికార్జున స్వామిలు స్వామి వారికి అభిషేకం,అర్చన,బండారు అర్చన,అమ్మవారికి కుంకుమార్చన,ఆకుపూజ,మహామంగళారతి తదితర పూజలు నిర్వహించారు. చిన్నారులు,మహిళలు,భక్తులు కుంకుమ బండారు అంటిస్తూ గిరిపైకి ఎక్కారు. ఆలయ నిర్వాహకులు విచ్చేసిన భక్తులకు అన్నదాన వసతి కల్పించారు.

## రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం



**ఆదోని,డిసెంబరు 8,ప్రభాతవార్త**

మండల పరిధిలోని పెద్దతుంబళం గ్రామంలో నేషనల్ ఇం.మీ హైస్కూల్‌లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన కంటి వైద్య శిబిరానికి స్పందన వచ్చిందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి,కార్యదర్శి డాక్టర్ సైఫుల్లాలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్ష,కార్యదర్శులు మాట్లాడుతూ రోటరీక్లబ్ ఆధ్వర్యంలో విద్య,వైద్యం,క్రీడానైపుణ్యం,మహిళల ఆర్థిక అభివృద్ధి తదితర సామాజిక సేవలో భాగంగా రోటరీక్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఉచిత కంటి వైద్యశిబిరం అవగాహన కోసం మండలంలోని కుప్పగల్లు,గణేకల్,జాలిమంచి,పెద్దతుంబళం గ్రామాల్లో ఆటోల ద్వారా ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. పట్టణ,గ్రామాల్లో కూడా రోటరీ సేవలు విస్తృత చేయడంలో భాగంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని,ఆపరేషన్లకు అవసరమైన పేషెంట్లకు కర్నూలు శాంతరామ్ ఆసుపత్రి వారి సహకారంతో ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా ఆపరేషన్లు చేయించడం జరుగుతుందని తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్డు లేని పేషెంట్లను రోటరీక్లబ్ సహకారంతో ఆపరేషన్లు చేయిస్తామన్నారు. ఉచిత కంటి వైద్య శిబిరానికి వందమంది హాజరై కంటి వైద్య పరీక్షలు చేసుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు జీవన్‌సింగ్,భరత్‌షా,శ్రీధర్‌రెడ్డి,సుబ్బయ్య, హుస్సేన్‌భాష,సాబీర్ భాష,శివరాం,నితిన్,వినోద్‌జైన్,రాజేష్ జైన్,శేషయ్య, రాజేష్,నితీష్ గాంధీ,వికాస్ గాంధీ,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నీలి షికారి పేటలో కార్డెన్‌సెర్చ్



**నందికొట్కూరు,డిసెంబర్ 8,ప్రభాతవార్త:** పట్టణంలోని నీలిషికారి పేటలో జిల్లా ఎస్పీ, ఆత్మకూరు డియస్పీ ఆదేశాల మేరకు పట్టణ సి.ఐ.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. దాడులలో 31 ప్లాస్టిక్ డ్రమ్ములలో ఉన్న వెయ్యి లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసి అలాగే 60 లీటర్ల నాటు సారాయిని శికారి లౌజి అను వ్యక్తి నుండి నాలుగు బిందెలలో పట్టుకొని అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపినట్లుగా సిఐ తెలిపారు. నాటు సారాయి వందుట అమ్ముట నేరమని వారి ఏరియా నందే కాలనీలో కౌన్సిలింగ్ ఇచ్చినట్లు సి.ఐ. తెలిపారు. ఈ కార్యక్రమంలో యుపిఎస్ ఎస్సైలు ఎం.చంద్రశేఖర్, జి.సురేష్‌బాబు, మిడుతూరు ఎస్సై ఓబులేష్, క్యూఆర్‌టి టీం మరియు సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

## అవార్డు రావడం హర్షణీయం

**పత్తికొండ,డిసెంబరు 8,ప్రభాతవార్త**



గుజరాత్ రాష్ట్రం నందు బిఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న బొల్లం రామాంజనేయులుకు రాజస్థాన్ రాష్ట్రం జోద్పూర్‌లో శౌర్యవంతుడు అనే అవార్డు రావడం హర్షణీయమని హోంగార్డు అన్వర్ భాష అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తన చిన్ననాటి మిత్రుడు బొల్లం రామాంజనేయులు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా నుండి అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇతంటి గొప్ప అవార్డు తీసుకోవడం మనతో పాటు మన ఊరికి ఎంతో గర్వకారణమని శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కుటుంబ సభ్యులు,బంధువులు శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో వైకుంఠం జ్యోతి

**ఆలూరు,డిసెంబరు 8,ప్రభాతవార్త**



ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ సతీమణి టిడిపి మహిళా నాయకురాలు వైకుంఠం జ్యోతి ఆదివారం తిరుమల కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలు,ఆలూరు నియోజకవర్గ ప్రజలందరి మీద ఉండాలని, మీ అందరి ప్రేమ,అభిమానాలు మరింత చూరగొనేలా ఆలూరు నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి,అభివృద్ధికి కృషి చేసే విధంగా మరింత శక్తిని ప్రసాదించాలని కోరుకోవడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం అంకితభావంతో పనిచేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండాలని మనసారా కోరుకున్నట్లు తెలిపారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**దేవనకొండ,డిసెంబరు 8,ప్రభాతవార్త**

దేవనకొండ గ్రామానికి చెందిన పెద్దలాలప్ప భార్య వీరమ్మ మృతిచెందడం జరిగింది. టిడిపి సభ్యత్వం కలిగి ఉన్నందున దేవనకొండ గ్రామ టిడిపి పార్లమెంట్ కార్యదర్శి ఆకుల వీరేష్,సర్పంచ్ భర్త బండ్లయ్య,రాజాసాహెబ్,మస్తాన్,మజీద్,రాముడు తదితరులు రూ.5వేలు ఆర్థిక సహాయం అందచేసి ఆమె మృతికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



# ఆ ముగ్గురు నాయకులు.. యుటర్న్..!?

- ఇద్దరు వార్డు కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు వెన్నుపోటు
- ఆత్మకూరు మున్సిపాలిటి రాజకీయంలో కీలక మలుపులు
- వెన్నుపోటు రాజకీయాలపై అధికార పార్టీ నేతల నిఘా పెట్టేనా



**ఆత్మకూరు,డిసెంబర్08,ప్రభాతవార్త:**
ఎన్నికల్లో ప్యాకేజ్ స్టార్లుగా ఉండి పార్టీ కోసం రంగులు మారుతున్న కొందరి తీరు ఏ పార్టీలో హుందగా ఉండే ఆలోచన లేకుండా పోయిందని చెప్పవచ్చు. కేవలం ఆ పూటకే మాటలు చెప్పి రాజకీయాలు కొనసాగిస్తున్న కొందరి నాయకులు, నమ్ముకున్న పార్టీకి వెన్నుపోటూ రాజకీయాలు చేసినప్పటికి ఆదే తప్పిదాలు మళ్లీ అధికార పార్టీలో కొనసాగుతున్న తీరుపై ఆ ముగ్గురు రాజకీయంగా... ఆ పార్టీలో యుటర్న్ తీసుకుంటారా అనే చర్చ జోరుగా ఆత్మకూరు పట్టణంలో కొనసాగుతుంది. ఇద్దరు వార్డు కౌన్సిలర్లు వారితో పాటు మాజీ వార్డు కౌన్సిలరు ముగ్గురు కలసి పార్టీలో ఉండి వారు కోరుకున్న ఆశయాలు నేరవేరకపోవడంతో అధికార పార్టీ నుంచి మరో పార్టీలోకి యుటర్న్ తీసుకునే విదంగా రాజకీయాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. గతంలో ఈ నాయకులు ఓ ప్రజాప్రతినిధికి నమ్మిన బంటుగా ఉంటూ పార్టీలో విలువ లేదంటూ ఆ సహనం వ్యక్తం చేసిన ఈ ముగ్గురు నాయకులు ప్రజలు వేసిన ఓటును ఒమ్ము చేస్తూ ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకిలో వెళ్లే విదంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటారు. శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు మున్సిపాలిటిలో జరుగుతున్న వెన్నుపోటు రాజకీయాలపై అధికార పార్టీ ప్రజాప్రతినిధి, ముఖ్య కీలక నాయకులు పార్టీలో యుటర్న్ తీసుకుంటున్న ఇద్దరు వార్డు కౌన్సిలర్, మాజీ కౌన్సిలర్‌పై నిఘా ఉంచుతారా లేక వదిలి వేస్తారా అనే విషయం తెలియాల్సి ఉంది.
ఎందుకు అధికార పార్టీలో యుటర్న్ తీసుకుంటున్న.. ఎన్నికల సమయంలో పార్టీ కోసం కార్యకర్త నుంచి నాయకుల వరకు అందరు పనిచేసిన విషయం తెలిసింది. అయితే నియోజకవర్గంలో అందరు సమానంగా ఉండాలనే సమ ఆలోచనతో అభివృద్ధి చేస్తూ ముందుకు వెళ్తున్న నియోజకవర్గ ప్రస్తుత ప్రజాప్రతినిధి అందరితో కలిసిమెలసి వెళ్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించే విదంగా కృషి చేస్తున్నారు. పార్టీలో అందరితో సమానంగా చూస్తున్న ఈ ముగ్గురు నాయకులకు వంట పట్టడం లేదు. రహస్యంగా ఆ పార్టీ నాయకులతో ముఖ్య సమావేశాలు కొనసాగిస్తూ పార్టీ ప్రతిష్టను భంగం కలిగించే విదంగా ఆ పార్టీ ప్రజాప్రతినిధితో కలసి అధికార పార్టీలో జరుగుతున్న రహస్య రాజకీయాలను చేరవేసే విదంగా వ్యవహరిస్తున్న ఆ ముగ్గురు నాయకులపై అధికార పార్టీ ప్రజాప్రతినిధి ముఖ్య నాయకులు ఎందుకు నిఘా ఉంచలేక పోతున్నారో తెలియడం లేదు. ఈ ముగ్గురు నాయకులు త్వరలోనే పార్టీలో యుటర్న్ తీసుకుంటారా లేక సర్దుమనుగుతారా అనే విషయాని వేచిచూడ్దాం.

# వైసీపీని వీడి.. టీడీపీలోకి చేరిన నాయకులు

- వంద మందికి పైగా నాయకులు, కార్యకర్తలు టీడీపీ గూటికి....
- పార్టీలోకి చేరిన వారికి కండువాలు అహ్వానించిన టీడీపీ జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి



**కౌతాళం, డిశంబర్08, ప్రభాతవార్త;**
మంలంలోని కుంబళనూరు గ్రామ సర్పంచ్ వీరేష్, ఎంపీటీసీ సభ్యులు ముత్తన్న, రేషన్ డీలర్ ఈరన్నగౌడ్‌తో పాటు వంద మంది వైసీపీ నాయకులు ఆదివారం పార్టీని వీడి టీడీపీలోకి చేరారు. వీరు వైసీపీ ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి ముఖ్య అనుచరులు. ఈ మేరకు వారికి టీడీపీ జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు, మండల సీనియర్ నాయకులు చెన్నబసప్ప ధని, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలోకి చేరిన వారు మాట్లాడుతూ టీడీపీ పార్టీ సిద్ధాంతాలు, సీఎం చంద్రబాబునాయుడు విజన్ మెచ్చి పార్టీలోకి చేరుతున్నట్లు తెలిపారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి రాజబాబు, బీసీ సాధికారిక రాష్ట్ర సభ్యులు సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

## బతుకు తెరువుకోసం వలస వెళ్లిన ఇంట్లో చోరి

- కూతురు పెళ్లి కోసం దాచిన.. రెండు తులాల బంగారు చోరి



**గోనెగ ండ్ల డిసెంబరు 8 ప్రభాతవార్త**
మండల కేంద్రమైన గోనెగండ్లలోని కురువ వీదిలో గుర్తు తెలియని దొంగలు గత బుధవారం చోరికి పాల్పడ్డారు.బాధితులు పులకుర్తి రంగస్వామి,పులకుర్తి ఈరమ్మ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు.వారు అందించిన సమాచారం మేరకు గోనెగండ్లకు చెందిన పులకుర్తి రంగస్వామి,ఈరమ్మలు వలసలు వెళ్లి బతుకు జీవనం సాగించేవారు.అయితే వారికి ఇక కూతురు,ఒక కుమారుడు ఉన్నారు.కూతురుకు పెళ్లి చేయాలని తలచి వలసవెళ్లి కూడబెట్టుకున్న డబ్బుతో రెండు తులాలు బంగారు కొని ఇంట్లోని బీరువాలో దాచి ఉంచారు.అయితే పెళ్లి ఖర్చులకు డబ్బు సంపాదించేందుకు గాను గత నెల 22 వతేదిన తెలంగాణాలో నల్గొండ జిల్లా కు వలస పోయారు.అయితే ఇంటి పక్కన తన రంగస్వామి అన్న ఇళ్లు కూడా ఉంది. ఈ నెల ఐదో తేదిన రంగస్వామి అన్న రంగస్వామి ఇంటిని గమనించగా తలుపులు బద్దలు కొట్టి బీరువాను పగలగొట్టినట్లు గమనించాడు.దీంతో ఐదో తేదిన రంగస్వామి కి ఫోన్ చేసి మీ ఇంట్లో దొంగతనం జరిగిందని సమాచారం ఇవ్వడంతో రంగస్వామి నల్గొండ నుంచి ఆరో తేదిన గోనెగండ్లకు వచ్చాడు.దొంగతనం జరిగి విదానంను తన బందువులతో మాట్లాడి ఆదివారం గోనెగండ్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు.బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్లున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

## శ్రీ రాఘవేంద్రస్వామి సన్నిధిలో వ్యవసాయ మంత్రి



**మంత్రాలయం,డిసెంబర్ 8,ప్రభాతవార్త:**
ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి దర్శనార్థమై కర్ణాటక వ్యవసాయశాఖ మంత్రిచలువరాయస్వామి ఆదివారం కుటుంబసమేతంగా మంత్రాలయం విచ్చేశారు.వీరికి శ్రీమఠం అధికారులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. శ్రీమఠం ఆనవాయితీ ప్రకారం ముందుగా గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని మంగళ హారతులిచ్చారు.అనంతరం శ్రీ రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శ్రీమఠం ప్రాకారంలో తిరుగుతూ మొక్కులు తీర్చుకున్నారు. వీరికి శ్రీమఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థులు శ్రీ రాఘవేంద్ర స్వామి మొమెంటో,ఫల,పుష్ప,మంత్రాక్షితలతో ఆశీర్వదించారు.

## పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన ఆత్మకూరు డిఎస్పీపి



**పగిడ్యాల, డిశంబరు 8,ప్రభాతవార్త**
నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్‌ను ఆధివారం ఆత్మకూరు డిఎస్‌పి ఆర్. రామాంజినాయక్ తనిఖీ చేశారు. వార్షిక తనిఖీలో బాగంగా రికార్డులను డిఎస్‌పి నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి ఆర్.రామాంజినాయక్ మాట్లాడుతూ పాతకేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు అందుకు సంబంధించిన వారి హాజరుపరిచి కేసులను డిస్పోజల్ చేయాలనీ ముచ్చుమర్రి ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డికి సూచించారు. శాంతిభద్రతలను దృష్టిలోవుంచుకుని మండలం లోని ఆయాగ్రామాలకు నియమించిన సిబ్బంది ఏమైనా సమస్యలు వుంటే అధికారుల దృష్టికితీసుకుని రావాలన్నారు.శా ంతి భద్రతలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సమస్యత్మాక గ్రామాలలో ముందుజాగ్రత్తగా శాంతిభద్రతలను దృష్ట్యా రాత్రి పగలు విదులు నిర్వహించడంతోపాటు నాకా బంది, పల్లె నిద్ర కార్యాక్రమాలతో పాటు గ్రామాలను పరిశీలించడం జరుగుతుందన్నారు. సిబ్బందికి ఏమైనా సమస్యలు వుంటే ఎస్‌పికి తెలియజేసి పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. డిఎస్‌పి ఎస్ఐ, ఎఎస్ఐ సిబ్బందికి దశ, దిశ నిర్ధేశం చేశారు. రికార్డులను పరిశీలించిన డిఎస్‌పి ఆర్.రామాంజినాయక్ సంతృప్తిని వ్యక్తం చేశారు. డిఎస్‌పి వెంట నందికొట్కూరు రూరల్ సిఐ టి.సుబ్రమణ్యం పాల్గొన్నారు.

# వ్యాపార కేంద్రాలుగా.. ప్రైవేట్ స్కూళ్లు..!

- ఆలూరు మండలంలో ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల కట్టడి పై నియంత్రణ ఎక్కడ
- యథేచ్ఛగా కేజీల పేర్లు చెబుతూ వేలల్లో ఫీజుల వసూళ్లు
- జిల్లా యంత్రాంగం మాత్రం అటు వైపు కన్నెత్తి కూడ చూడడంలేదు
- అడ్డగోలుగా ఫీజులు వసూళ్లు చేస్తున్న ప్రైవేట్ స్కూళ్ల పై..

ప్రభాతవార్త ప్రత్యేక కథనం



**ఆలూరు రూరల్, డిసెంబర్8, ప్రభాతవార్త:**
ఆలూరు మండలంలో ప్రైవేట్ స్కూళ్ల పరిస్థితులు ఎలా ఉన్నాయంటే ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు అడుగులకు మడుగులు వత్తుతూ మండల య ంత్రాంగం నిమ్మకు నీరెత్తిన్నట్లు వ్యవహరించడం పలు విమర్శలకు దారితీస్తుంది. కాని ఇవన్నీ మాకెందుకు మాకు వచ్చేది వస్తే చాలు అన్న ఆలోచనలో అధికారులు వ్యవహరి స్తున్నట్లు స్పష్టం అవుతోంది. ఎన్ని ఫిర్యాదులు వచ్చినా వాటి పై పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఇంతవరకు చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించలేదు. ప్రధానంగా ఆలూరు పట్టణంలో ఎల్ఐసీ ఆఫీస్ వెనుక భాగంలోని ఉన్నటువంటి శ్రీ చైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూల్ పేరుతో బోర్డు ఏర్పాటుచేశారు. దీనికి ఎలాంటి రిజిస్ట్రేషన్‌కాని, టెక్నో ఇంగ్లిష్ మీడియం స్కూల్ అని ప్రభుత్వం నుండి ఎలాంటి రిజిస్ట్రేషన్ పొందలేదు. అంతేకాక నిబంధనలకు విరుద్ధంగా స్కూల్‌లో విద్యార్థులు ఆడుకునేందుకు క్రీడా మైదానం, మరుగుదొడ్లు, ఫైర్ సేఫ్టీ వంటి నిబంధనలు పాటించడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే స్కూల్‌కు విద్యార్థులను తరలించడానికి ప్రైవేట్ వాహనాలు, మూడు చక్రాల ఆటోలు ఇలాంటి వాహనాల్లో విద్యార్థులను పరిమితికి మించి స్కూల్‌కు తరలిస్తున్న సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోగా విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడడమే కాకుండా ఎలాంటి భద్రత నియమాలు పాటించడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అంత కాకుండా ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు ఎంత చెబితే అంతా విద్యార్థులు తల్లిదండ్రులు అంత ఫీజు చెల్లించాల్సిందేనని లేకుంటే విద్యార్థులను పనిష్మెంట్ పేరుతో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయడమే కాకుండా పరీక్షలు రాయనివ్వరు. విద్యార్థుల తల్లిదండ్రులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తే ఆ స్కూళ్ల పై చర్యలు ఉండవు.
**అధిక ఫీజుల మోత :** ప్రతి ప్రైవేట్ స్కూల్‌లో కమిటీలు ఏర్పాటుచేసి ఫీజులు నిర్ణయించాల్సి ఉంటుంది. కాని అలా ఎక్కడ ఆలూరు మండలంలో జరగడంలేదు. స్కూళ్లల్లో ఉంటున్న సదుపాయాలు, మౌలిక వసతులు, టీచర్ల ఆధారంగా కమిటీలో ఉన్న సభ్యులు ఫీజులు నిర్ణయించాల్సి ఉంటుంది. అలా ఆలూరు మండలంలో ఎక్కడ జరగడంలేదు. స్కూల్‌లో ఎంత ఫీజు వసూళ్లు చేస్తున్నారో స్కూల్ బయట నోటీసు బోర్డులో పెట్టాల్సి ఉన్నప్పటికి వాటిని కూడా అమలు చేయడంలేదు. అధిక ఫీజులు వసూళ్లు చేస్తూ విద్యతో వ్యాపారం చేస్తున్నారు. ఆలూరు మండలంలో వారి వ్యాపారం ఎలా ఉందంటే మూడుపువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది. అయితే జిల్లా విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతోనే ప్రైవేట్ స్కూళ్లు నిబంధనలు పాటించకుండా వ్యవహరిస్తున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలో 15 నుండి 20 స్కూళ్లు ఉన్నాయి. ఆ స్కూళ్ల పై ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపడితే నిజా నిజాలు బయటకు వస్తాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. నిబంధనలు పాటించని ప్రైవేట్ స్కూళ్లను గుర్తించి అధికారులు చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి. అయితే ఈ విషయం పై ఎంఈవో చిరంజీవిని వివరణ కోరగా అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్నట్లు ఎటువంటి ఫిర్యాదులు అందలేదని ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## కూడ చైర్మన్ సోమిశెట్టిని కలిసిన వీరభద్రగౌడ్



**ఆలూరు,డిసెంబరు 8,ప్రభాతవార్త**
కర్నూలులోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లుని ఆలూరు టిడిపి ఇంచార్జ వీరభద్రగౌడ్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మంత్రి టిజీ భరత్,జిల్లా పార్లమెంట్ ఇంచార్జ్ తిక్కారెడ్డిలను కలిసి ఆలూరు నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు.

## నేడు పిజిఅర్‌యస్ ద్వారా పిర్యాదులు స్వీకరణ



**నంద్యాల, డిశంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి**
ఈ నెల 9వ తేది అంటే నేడు సోమవారము నంద్యాల పట్టణంలోని కలెక్టరేట్‌లో పిజిఅర్‌యస్ పిర్యాదలను స్వీకరించడము జరుగుతుందని కలెక్టరు రాజకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రఝా సమస్యల పరిస్కారానికి ప్రజల నుంచి అర్జిలు స్వీకరించే ప్రక్రియను పసబ్లిక గ్రీవియన్స్ రెడ్రెస్సల్ సిస్టం(పిజిఅర్‌యస్0 ద్వారాచేపట్టడము జరుగుతుందని చెప్పారు. ప్రజల నుండి పిర్యాదులు స్వీకరించే పబ్లిక్ గ్రీవియన్స్ రెడ్రెస్సల్ సిస్టం కార్యక్రమానికి ఈనెల 9వ తేదిన ఉదయం 9.30రనిమిషాలకు జిల్లా అదికారులందరు హజరు కావలని అమె కోరారు. అలాగే ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్రములోనే కాకుండా అన్ని డివిజన్, నియోజక వర్గ, మండల కేంద్రాలో అయా శాఖల కార్యాలయాల యందు నిర్వహించడము జరుగుతుందని అమె చెప్పారు. అక్కడి దరాఖాస్తు ఇచి ్చన కూడా అన్‌లైన్ ద్వారా ఇక్కడకు చేరుతుందని చెప్పారు.

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

- ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



**కర్నూలు అర్బన్, డిసెంబర్ 8, ప్రభాతవార్తః**
విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఏబి మర్టియల్ అర్ట్స్ అకాడమి అధ్వర్యంలో సౌత్ ఇండియా ఓపెన్ కరాటే చాంఫియన్‌షిప్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి కరాటే పోటీలను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతూ పాటు క్రీడల్లో కూడ రాణించాలని అప్పుడే వారి భవిష్యత్తుకు బంగారు బాట అవుతుందన్నారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈకార్యక్రమంలో కరాటే స్పాన్సర్స్ టిడిపి నాయకులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## తెదేపాతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం..!

- ఆలూరు తెదేపా ఇంచార్జ వీరభద్రగౌడ్



**ఆలూరు,డిసెంబరు 8,ప్రభాతవార్త:**
తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఆలూరు తెదేపా ఇంచార్జ వీరభద్రగౌడ్ అన్నారు. ఆదివారం కర్నూలులోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పాలకుర్తి తిక్కారెడ్డి అధ్యక్షతన పార్టీ సభ్యత్వ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి టిజీ భరత్,కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు,పత్తికొండ ఎమ్మెల్యే కెఈ శ్యాంబాబు,కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిలతో పాటు టిడిపి ఇంచార్జ వీరభద్రగౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరభద్రగౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో ప్రతిఒక్కరికి అండగా ఉంటూ అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ,రాష్ట్ర కురువ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప పాల్గొన్నారు.

## భక్తులతో పోటెత్తిన మల్లన్న క్షేత్రం






**శ్రీశైలంప్రాజెక్టు,డిసెంబర్08,ప్రభాతవార్త :**
అష్టదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం మహాపుణ్యక్షేత్రం ఆదివారంనాడు భక్తులతో క్యూలైన్లన్ని కిటకిటాలాడింది. భక్తులతో శ్రీగిరిక్షేత్రమంత జనసందోహంతో నిండుకుంది.భక్తులు పెద్ద సంఖ్యలో శ్రీశైలంకు తరలి వచ్చారు. ఈక్రమంలోనే శ్రీశైలం రహదారులన్ని వాహనాలతో కిక్కిరిసి పోయాయి.
అదే విధంగా శ్రీశైలంకు చేరుకున్న భక్తులు ఎంతో భక్తిశ్రద్దలతో ముందుగా తమ మ్రొక్కులను తీర్చుకునేందుకు పాతళగంగలో పుణ్యస్నానాలు అచరించి తలనీలాలు సమర్పిస్తూ తదుపరి శ్రీస్వామిఅమ్మవార్ల దర్శనం కోరకు క్యూలైన్ల వద్దకు చేరుకుంటున్నారు.ఈ నేపథ్యాంలోనే ఆలయ పురవీదులన్ని భక్తుల సందడి నెలకో ంది.ఈక్రమంలోనే ఆలయ క్యూలైన్లన్ని నిండిపోవడంతో మల్లన్న దర్శనం గంటల తరబడి భక్తులు వేచిఉంటున్నారు. ఎక్కడ చూసి భకు_ ్తలు కిక్కిరిసిపోయారు.మల్లన్న దర్శనబాగ్యం కొరకు వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా దేవస్థానం కార్యనిర్వహణాదికారి యం.శ్రీనివాసరావు ఏర్పాట ్లపై అధికారులను ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకుంటూ సయనా ఏర్పాట్లపై భక్తులతో ముఖాముఖి సంబాషించారు.

# లక్ష్మాపురంలో వ్యక్తి.. ఆత్మహత్య..!

: కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు.. బుడగజంగం కాలనీలో విషాదం



**పగిడ్యాల, డిశంబరు 8,ప్రభాతవార్త**
నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం లక్ష్మాపురంలో ఆదివారం రాత్రి 6 గంటల సమయంలో బుడగజంగాల రామాంజనేయులు (30) ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యచేసుకుని మృతి చెందారు. స్థానికుల కథనంమేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రామాంజనేయులు భార్య సంవత్సరం క్రిందం మృతి చెందింది. ఆయనకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. శనివారం రాత్రి 1గంట సమయంలో కాలనీలో తిరుగుతుండగా రాత్రివేళలో కార్పెంటరు బాష కుమారులు ఉశెనాలం, మస్తాన్ వారి చెల్లి ఇంటికి వెళ్లిన రామాంజనేయులు డోర్ కొట్టారు దీంతో ఆమె తిరగబడింది దీంతో అమె సోదరులు ఉశెనాలం మస్తాన్ రామాంజనేయులును చెట్టుకు కట్టేసి కొట్టారు. మనస్థాపానికి గురైన రామాంజనేయులు ఆదివారం సాయంత్రం స్వగృహంలో చీరతో గరండాకు ఉరివేసుకుని మృతి చెందారు. పొలం పనులకు వెళ్లివచ్చిన తల్లిదండ్రులు రాముడు లక్ష్మిదేవి తలుపు తెరిచి చూసేలోపు కొడుకు రామాంజనేయులు ఉరివేసుకుని మృతి చెందిన శవం చూసి కన్నీరుమున్నీరయ్యారు. సమాచారం తెలియడంతో ముచ్చుమర్రి ఎస్ఐ శరత్‌కుమార్ ఒడ్డి ఎస్ఐ జి.సుబ్బారావు సిబ్బంది సంఘటనా స్థలం పరిశీలించారు. రామాంజనేయులు తల్లి లక్ష్మి తన కుమారుడిని చెట్టుకు కట్టెసి కొట్టి



నందువల్ల మనస్థాపం చెంది ఉరివేసుకుని మృతి చెందాడనీ కుమారుడికి భార ్యకూడా మృతి చెందిందనీ, ఇద్దరు కుమారులు ఇన్నారనీ, తన కుమారుడు మృతి చెందితే వాడి కుమారులు ఎలా బతుకు తారనీ ఎస్ఐ ఎదుట ఆవేదన వ్యక్తం చేసింది. బాధితులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు.